# వాహనాల దారి మళ్లింపు

- మంత్రి కేటీఆర్ నగర పర్యటన నేపథ్యంలో పోలీసుల నిర్ణయం
- ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు
- వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్

సుబేదారి, అక్టోబర్ 5 : మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వరంగల్ నగరానికి శుక్రవారం వస్తున్న నేపథ్యంలో వరంగల్ పోలీసు కమిషనరేట్ అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి పర్యటించే వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసే ప్రాంతాలతో పాటు వరంగల్‌లోని చింతల్, హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభ స్థలాల వద్ద పోలీసు బలగాలను మోహరించారు. మంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై సీపీ రంగనాథ్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి, పోలీసులకు దిశానిర్దేశం చేశారు. నలుగురు డీసీపీలు, 8 మంది ఏసీపీలతో పాటు సీఐలు, ఎస్సైలు బందోబస్తు విధుల్లో ఉంటారని తెలిపారు. అలాగే శుక్రవారం ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని సీపీ పేర్కొన్నారు. ములుగు, భూపాలపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్లే భారీ వాహనాలు నగర శివారు ఆరెపల్లి ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా, అలాగే భూపాలపల్లి, ములుగు, పరకాల నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు ఆరెపల్లి ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా కరుణాపురం, మడికొండ, కడిపికొండ, నాయుడు పెట్రోల్ పంపు మీదుగా వెళ్లాలని సూచించారు. భూపాలపల్లి, ములుగు నుంచి నర్సంపేట వెళ్లే భారీ వాహనాలు ఆరెపల్లి కొత్తపేట నుంచి జాన్‌పీరీలు, గొర్రెకుంట ద్వారా వెళ్లాలని కోరారు. సిటీ లోపలికి వచ్చే భారీ వాహనాలను నగర శివార్లలో నిలుపుకోవాలన్నారు. ములుగు, భూపాలపల్లి నుంచి ఆర్టీసీ బస్సులు పెద్దమ్మగడ్డ మీదుగా కేయూసీ జంక్షన్, అంబేద్కర్ జంక్షన్, ఏషియన్ మాల్ ద్వారా హనుమకొండ బస్‌స్టేషన్‌కు చేరుకోవాలని, అన్ని ఆర్టీసీ బస్సులు ఇదే మార్గంలో వెళ్లాలని సూచించారు. హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి నర్సంపేట, ఖమ్మం, తొర్రూర్ వెళ్లే ఆర్టీసీ బస్సులు వయా బాలసముద్రం, అదాలత్, హంటర్ రోడ్డు మీదుగా నడపాలని, వరంగల్ బస్‌స్టేషన్ నుంచి హనుమకొండ వెళ్లే ఆర్టీసీ బస్సులను చింతల్ బ్రిడ్జి, రంగశాయిపేట, నాయుడు పెట్రోల్ పంపు, ఉర్సుగుట్ట, హంటర్ రోడ్డు, అదాలత్, బాలసముద్రం మీదుగా నడపాలని సూచించారు.

## అనారోగ్యంతో సమ్మక్క పూజారి మృతి


లక్ష్మణ్‌రావు(ఫైల్)

తాడ్వాయి, అక్టోబర్ 5 : మేడారం సమ్మక్క దేవత ప్రధాన పూజారి సిద్దబోయిన లక్ష్మణ్‌రావు(48) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. నెల రోజుల క్రితం అనారోగ్యానికి గురికాగా కుటుంబ సభ్యులు ఆయనను వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మేడారంలోని తమ ఇంటికి తీసుకురాగా అప్పటి నుంచి మందులు వాడుతున్నాడు. రెండు రోజుల నుంచి జ్వరం రావడంతో స్థానికంగా వైద్యం పొందుతున్నాడు. ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, ముగ్గురు పిల్లలు సౌమ్య, సౌజన్య, నితిన్ ఉన్నారు. లక్ష్మణ్‌రావు కుటుంబాన్ని జడ్పీ చైర్‌పర్సన్, ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి, ఎమ్మెల్యే సీతక్క పరామర్శించారు.

**లక్ష్మణ్‌రావు మృతి బాధాకరం..**

**- మంత్రి సత్యవతి రాథోడ్**

సమ్మక్క దేవత పూజారి సిద్దబోయిన లక్ష్మణ్‌రావు మృతి బాధాకరమని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. పూజారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తెలిపారు.

## కేయూ ఆరోగ్యకేంద్రంలో ఫుల్‌టైం మెడికల్ ఆఫీసర్‌కు ఇంటర్వ్యూ

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 5 : కాకతీయ విశ్వవిద్యాలయ ఆరోగ్య కేంద్రంలో ఫుల్ టైం మెడికల్ ఆఫీసర్(మేల్)గా పని చేయడానికి ఎంబీబీఎస్ అర్హత కలిగిన అభ్యర్థులకు ఈ నెల 7న సాయంత్రం 4 గంటలకు విశ్వవిద్యాలయ పరిపాలనా భవన ప్రాంగణంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు విశ్వవిద్యాలయ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులకు సేవలు అందించాలని, నెలకు రూ.35 వేలు చెల్లిస్తామన్నారు. అభ్యర్థులు రెస్యూమ్, ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని సూచించారు.

### రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, అక్టోబర్ 5 : కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ఉదయం వెలుగు చూసింది. కాజీపేట జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. టౌన్ రైల్వే స్టేషన్‌లోని సాండ్ రూం సమీపంలో ఎర్నాకులం సూపర్ ఫాస్ట్ రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వయసు సుమారు 60 ఏండ్లు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించి భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కాజీపేట జీఆర్పీ లేదా 8712568497 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## 'నీతి ఆయోగ్'కు రెండు మండలాల ఎంపిక

- అభివృద్ధిపై సర్పంచ్‌లు, అధికారులకు శిక్షణ
- ప్రణాళికలు రూపొందించిన మహాముత్తారం, పలిమెల మండలాల అధికారులు


ఇటీవల ప్రధాని మోదీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

మహాముత్తారం, అక్టోబర్ 5 : మహాముత్తారం, పలిమెల మండలాలు నీతి ఆయోగ్‌కు ఎంపిక కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నీతి ఆయోగ్ సూచనల మేరకు మండలాల్లో 39 అంశాలపై ప్రణాళికలు రూపొందించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నారు. దీని కోసం ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్‌లో రెండు రోజుల పాటు బ్లాక్ స్థాయి అధికారులు శిక్షణ తీసుకున్నారు. సెప్టెంబర్ 30న ఢిల్లీలోని భారత్ మండపంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన సంకల్ప్ సప్తాహ్ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి చీఫ్ ప్లానింగ్ అధికారి కే శామ్యూల్, మహాముత్తారం ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, పలిమెల ఎంపీడీవో ప్రకాశ్, ములుగుపల్లి సర్పంచ్ దూలం మల్లయ్యగౌడ్, స్తంభంపల్లి సర్పంచ్ జాడి రాజయ్య, రేగులగూడెం సర్పంచ్ భూషి దేవేందర్‌రెడ్డి, కొర్లకుంట సర్పంచ్ ముక్కెర నవీన్‌గౌడ్, నర్సింగాపూర్ సర్పంచ్ లక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసే కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా 500 బ్లాకులు ఎంపికయ్యాయి. అందులో భూపాలపల్లి నుంచి మహాముత్తారం, పలిమెల మండలాలు ఎంపికయ్యాయి. నీతి ఆయోగ్ ద్వారా మంజూరైన నిధులతో పాటు మండలంలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఈ రెండు మండలాలను అభివృద్ధి చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, రహదారులు, తాగునీరు, విద్యుదీకరణతో పాటు పలు సదుపాయాలను ప్రజలకు అందించడమే లక్ష్యంగా నీతి ఆయోగ్ కార్యక్రమాలు చేపడుతున్నది. మహాముత్తారం, పలిమెల మండలాల్లో రెండు సంవత్సరాల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## కరెంట్ మోటర్ల దొంగల అరెస్టు

**ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ వెల్లడి**

కాశీబుగ్గ, అక్టోబర్ 5 : గ్రేటర్ వరంగల్‌లోని 3వ డివిజన్ పైడిపల్లికి చెందిన రైతులు పొలాల దగ్గర ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటర్లను చోరీ చేసిన అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకున్నట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. గురువారం ఎనుమాముల పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా రైతుల కరెంట్ మోటర్లు చోరీకి గురవుతున్నాయి. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు గతంలో మోటర్ల చోరీకి పాల్పడ్డ వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా, అనుమానితులు ఎనుమాములలోని బాబు జగ్జీవన్‌రావు సెంటర్‌లో తిరుగుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొన్ని కుటుంబాలు పైడిపల్లి సర్దార్‌పేటలోని ఇటుక బట్టీల్లో పని చేస్తున్నాయి. 6 నెలలుగా పని లేక పోవడంతో చాలా మంది తిరిగి తమ ప్రాంతానికి వెళ్లారు. హైదర్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో ఇక్కడే ఉన్నాడు. ఇతడికి 12 మంది సంతానం కాగా, సంపాదన సరిపోకపోవడంతో మోటర్లను చోరీ చేసి బాలాజీనగర్‌కు చెందిన గంధం పోశాలుకు చెందిన పాత ఇనుప సామాన్ల దుకాణంలో అమ్మినట్లు తెలిపారు. పోలీసులకు అందిన విశ్వసనీయమైన సమాచారం మేరకు నేరస్తులను పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. 13 కరెంట్ మోటర్లు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ. లక్షా 44వేల 500 అని తెలిపారు. ఏసీపీ సతీశ్‌బాబు, సీఐ మహేందర్, ఎస్సై పోగుల శ్రీకాంత్, ఏఎస్సై బీ ఉప్పలయ్య, సిబ్బంది విజయ్‌కుమార్, మహేందర్, రవీందర్‌రెడ్డి, దీపక్‌లకు డీసీపీ రివార్డులు అందజేసి అభినందించారు.


స్వాధీనం చేసుకున్న విద్యుత్ మోటర్లు, నిందితుల అరెస్టు చూపిస్తున్న డీసీపీ రవీందర్

## 680 మందికి పోలీసు ఉద్యోగాలు

- వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో కానిస్టేబుళ్లుగా ఎంపిక
- 432 మంది సివిల్, 226 మంది ఏఆర్, 22 మంది ఇతర విభాగాలకు..

సుబేదారి, అక్టోబర్ 5 : పోలీసు ఉద్యోగాలకు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 680 మంది ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ చివరి వారంలో నిర్వహించిన తుది రాత పరీక్షకు కమిషనరేట్ నుంచి 12,036 మంది హాజరయ్యారు. బుధవారం వెల్లడైన ఫలితాల్లో 432 మంది సివిల్, 226 మంది ఏఆర్, 22 మంది ఇతర విభాగాలకు ఎంపికైనట్లు పోలీసు అధికారులు తెలిపారు.

### అంబేద్కర్ వర్సిటీలో అడ్మిషన్లకు గడువు పొడిగింపు

హనుమకొండ, అక్టోబర్ 5 : అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకొనేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు రీజినల్ కో ఆర్డినేటర్ ఏ రాజు ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రీజినల్ సెంటర్లో మాత్రమే పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు, ఆర్ట్స్, సైన్స్ సబ్జెక్టులు, సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. డిగ్రీ ఆర్ట్స్, సైన్స్ కోర్సులు హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల, వరంగల్ సీకేఎం డిగ్రీ కళాశాల, ములుగు, పరకాల, జనగామ, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూరు, భూపాలపల్లి, ఏటూరు నాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరేందుకు విద్యార్హతలు, ఫీజు తదితర వివరాలను www.braouonline.inలో పొందుపర్చినట్లు వెల్లడించారు. ఇంటర్మీడియెట్, నేషనల్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఇంటర్ పూర్తి చేసిన వారు, పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సుల్లో పాసైన విద్యార్థులు నేరుగా డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో కోర్సులు ఉన్నట్లు తెలిపారు. అలాగే పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ, డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు కోర్సు ఫీజు కూడా ఈ నెల 20వ తేదీలోగా చెల్లించుకోవచ్చని, మరిన్ని వివరాలకు 73829 29621 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## కేయూ తెలుగు పాఠ్య ప్రణాళికా సంఘం అధ్యక్షుడిగా శంకరయ్య


శంకరయ్య


వీరస్వామి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 5 : కేయూ తెలుగు పాఠ్య ప్రణాళికా సంఘం అధ్యక్షుడిగా మంథని శంకరయ్యను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు నియమించారు. ప్రస్తుత అధ్యక్షుడు ప్రొఫెసర్ బన్న అయిలయ్య నుంచి బాధ్యతలు స్వీకరిస్తారని, ఆయన ఈ పదవిలో తిరిగి ఉత్తర్వులు అందేవరకు కొనసాగుతారన్నారు. శంకరయ్య కేయూలో 2008లో పార్ట్‌టైం లెక్చరర్‌గా బోధన ప్రారంభించి 2010లో 'శిఖామణి కవిత్వం-సమగ్ర పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. 2008లో ఆర్‌జేఎన్‌ఎఫ్ ఫెలోషిప్ పొంది, ఎంఏ సంస్కృతం, ఎంసీజే జర్నలిజం కోర్సులు పూర్తి చేశారు. తెలుగు విభాగంలో ఎంఏ తెలుగు విద్యార్థులకు సంస్కృతం, ప్రాచీన, దళిత, ప్రాంతీయ సాహిత్యం బోధించేవారు. 2009 నుంచి సాహితీ రచనలు మొదలుపెట్టారు. ఆయన రచించిన జక్కులు నవలకు ప్రతిష్ఠాత్మక కొలకలూరు విశ్రాంతమ్మ నవలా పురస్కారం లభించింది.

**పొలిటికల్ సైన్స్ విభాగాధిపతిగా వీరస్వామి..**

కేయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతిగా ఒప్పంద అధ్యాపకుడు కే వీరస్వామి నియమితులయ్యారు. ప్రస్తుత విభాగాధిపతి రామచంద్రం నుంచి ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. వీరస్వామి 1994లో పార్ట్‌టైం లెక్చరర్‌గా, 2000వ సంవత్సరంలో ఒప్పంద అధ్యాపకుడిగా పని చేశారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో పొలిటికల్ సైన్స్ విభాగ ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. 10 పరిశోధన పత్రాలు ముద్రించారు. ఒక పుస్తకాన్ని పబ్లిష్ చేశారు. 30 జాతీయ సెమినార్లు, 50 రాష్ట్ర స్థాయి సెమినార్లలో పత్రాలు సమర్పించారు.